సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 15 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 550 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.13



న్యూస్‌రీల్

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో.. ఆలిండియా 6వ ర్యాంకు



పునీత్‌కుమార్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్/రామగిరి : ఇటీవల జరిగిన కోరుకొండ సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షలో జిల్లాలోని రామగిరి మండలం పేరూరుకు చెందిన విద్యార్థి పునీత్ కుమార్‌రెడ్డికి ఆలిండియా 6వ ర్యాంకు వచ్చింది. పేరూరుకు చెందిన శంకర్‌రెడ్డి, రజిని దంపతుల కుమారుడు పునీత్ 300 మార్కులకు 288 మార్కులు సాధించాడు. మ్యాథ్స్‌లో 150కి 150, ఇంటెలిజెన్స్ సబ్జెక్టులో 50కి 50, ల్యాంగ్వేజ్‌లో 50కి 48, జనరల్ నాలెడ్జిలో 50కి 40 మార్కులు సాధించారు. సౌత్ ఇండియాలో మొదటి ర్యాంకు సాధించినట్లు పునీత్ తండ్రి శంకర్‌రెడ్డి చెప్పారు. విద్యార్థి 5వ తరగతి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు.

ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు



పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగిశాయి. చివరి రోజు గురువారం కెమిస్ట్రీ-1, కామర్స్-1 పరీక్షలు జరిగాయి. జనరల్ విద్యార్థులు 10,691 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,190 మంది హాజరయ్యారు. మొత్తంగా 476 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. కాగా ద్వితీయ సంవత్సర పరీక్షలు శుక్రవారంతో ముగుస్తాయి. ఆ తర్వాత రెండు రోజులు మైనర్ సబ్జెక్టుల పరీక్షలు ఉంటాయి.

నమ్మించి.. వంచించి!

వాడుకుని వదిలేసే నైజాన్ని చంద్రబాబు మరోసారి చాటుకున్నారు. వేరే వాళ్లు చేస్తే అవినీతి.. తమ వాళ్లు చేస్తే మాత్రం కాదనీ చాటారు. తాజాగా ప్రకటించిన టీడీపీ అభ్యర్థుల జాబితాను చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమైపోతుంది. 'పని చేసుకో... నీకే టికెట్' అంటూ ఊరించి శ్రీరామ్‌ను ఉసూరుమనిపించారు. ఓ కేసులో శిక్ష సైతం పడిన వ్యక్తి భార్యకే సీటు కేటాయించి, అవినీతి మకిలిని తమకు అంటనట్లుగా ప్రజల కళ్లకు గంతలు కట్టారు. మరోచోట బీసీలకు కుచ్చు టోపీ పెట్టారు. అభ్యర్థుల ప్రకటనతో యథాలాపంగానే తన వంచన బుద్ధిని బయటపెట్టారు.



తీరు మార్చుకోని బాబు

- ధర్మవరంలో శ్రీరామ్‌కు కుచ్చుటోపీ!
- పుట్టపర్తిలో బీసీలకు మోసం..
- అక్రమార్కుడి భార్యకే కదిరి టికెట్
- అనంతపురం, గుంతకల్లు సీట్లపై ఇంకా సందిగ్ధమే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మొన్నటిదాకా ధర్మవరం నాదే.. ఎమ్మెల్యే సీటూ నాదే అంటూ సవాల్ విసిరిన పరిటాల శ్రీరామ్ చతికిలపడ్డారు. చంద్రబాబు గురి చూసి వదిలిన బౌన్సర్‌తో ఎటూ పాలుపోక గిలగిల కొట్టుకుంటున్నారు. తాజాగా టీడీపీ విడుదల చేసిన జాబితాలో శ్రీరామ్ పేరు లేకపోవడం, ఇదే క్రమంలో గురువారం వరదాపురం సూరి తాడిమర్రి మండలంలో ప్రచారానికి తెరలేపడం శ్రీరామ్‌కు కుచ్చుటోపీ పెట్టారని చెప్పకనే చెప్పినట్లయింది. బాబు ఇచ్చిన ధైర్యంతోనే సూరి రంగంలోకి దిగారని పలువురు చర్చించుకుంటున్నారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా పరిటాల శ్రీరామ్ నాలుగేళ్లుగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. టికెట్టు తనకే వస్తుందంటూ ముందుకు సాగారు. తాజాగా సూరి తెరపైకి రావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ పరిణామాలతో కనీసం రాప్తాడు నియోజకవర్గంలోనైనా కేడర్ సహకరిస్తుందా లేదా అన్న మీమాంసలో పరిటాల సునీత, తనయుడు శ్రీరామ్ కొట్టుమిట్టాడుతున్నారు.



పల్లె సింధూరకు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ చంద్రబాబు ఇంటి వద్ద బైఠాయించిన పుట్టపర్తి వడ్డెర నాయకులు

పల్లెకు సీటు.. బీసీ వర్గాల భగ్గు..

పుట్టపర్తి టీడీపీ టికెట్ పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరరెడ్డికి కేటాయించడంతో బీసీ వర్గాలు భగ్గుమన్నాయి. గత రెండు నెలలుగా ఇక్కడ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన నేతలు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. తాజాగా పల్లె కోడలిని అభ్యర్థిగా ప్రకటించడంతో వారు ఏకంగా చంద్రబాబు ఇంటి వద్దనే ధర్నాకు దిగారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ తమను నమ్మించి మోసం చేశారని వడ్డెర సంఘం నాయకులు వడ్డె ఉమారాజు, న్యాయవాది అంజనేయులు మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 40 లక్షల మంది వడ్డెర్లను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొంటున్నారన్నారు. పుట్టపర్తి అసెంబ్లీ టికెట్టు వడ్డెర్లకు కేటాయిస్తామంటూ రెండేళ్లు వెంట తిప్పుకొని, చివరికి పల్లె రఘునాథరెడ్డి ఇచ్చే డబ్బుకు అమ్ముడుపోయారని ధ్వజమెత్తారు. టీడీపీని ఓడించి తీరుతామని స్పష్టం చేశారు.

భర్తకు శిక్షపడితే భార్యకు ఇచ్చారు!

2009లో కదిరిలో టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన కందికుంట వెంకట ప్రసాద్‌కు నకిలీ డీడీల కేసులో శిక్ష పడింది. దీంతో ఆయన భార్య యశోదమ్మకు టికెట్ కేటాయించారు. ఇటీవల నారా లోకేష్ అనంతపురం పర్యటన సమయంలో అవినీతిపరులు అంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలను విమర్శించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు అవినీతి పరులైతే.. శిక్షపడిన వారిని ఏమనాలి..భర్తకు శిక్ష పడితే భార్యకు టికెట్ ఇవ్వొచ్చా..? అని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2014లో కదిరిలో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి.. తర్వాత టీడీపీలోకి వెళ్లిన అత్తార్‌కు మొండిచేయి చూపడంతో మైనార్టీలు అసంతృప్తిలో ఉన్నారు.

అనంతపురం, గుంతకల్లు సస్పెన్స్‌లోనే..

అనంతపురం, గుంతకల్లు సీట్లపై ఇంకా చంద్రబాబు స్పష్టత ఇవ్వలేదు.అనంతపురం సీటు మొన్నటివరకూ జనసేనకు అన్నారు.. ఇప్పుడేమో తెలుగుదేశం పార్టీకే అంటుండడంతో బలిజ సామాజిక వర్గం భగ్గుమంటోంది. మరోవైపు గుంతకల్లు నుంచి తాను పోటీచేస్తున్నానని గుమ్మనూరు జయరాం ప్రకటించడంతో పేకాట మంత్రి తమ కొద్దు అంటూ టీడీపీ నాయకులే ర్యాలీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలపై సస్పెన్స్ కొనసాగుతోంది.

లలితమ్మకు కన్నీటి వీడ్కోలు



లలితమ్మ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి

- నివాళులర్పించిన సీఎం వైఎస్ జగన్, ప్రముఖులు

వజ్రకరూరు: మాజీ ఎమ్మెల్యే దివంగత వై.భీమిరెడ్డి సతీమణి, ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి మాతృమూర్తి వై.లలితమ్మ అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ ముగిశాయి. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. గురువారం పార్థివదేహాన్ని ఆమె స్వగ్రామమైన మండలంలోని కొనకొండ్లకు తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనకొండ్లకు వచ్చి లలితమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

కుటుంబ సభ్యుల కన్నీటిపర్యంతం

మాతృమూర్తి మరణంతో ఆమె కుమారులు, కుమార్తె విషాద సాగరంలో మునిగిపోయారు. తల్లి పార్థివదేహం వద్ద ఎమ్మెల్సీ, వై.శివరామిరెడ్డి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి, కుమార్తె వరలక్ష్మి, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, శంకరనారాయణ, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కర్నూలు మేయర్ బీవై.రామయ్య, పలువురు నాయకులు లలితమ్మ పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. లలితమ్మ మృతితో వజ్రకరూరు మండలం కన్నీటి సంద్రమైంది. లలితమ్మను కడసారి చూపు చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.



లలితమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న జనం

అగ్ర కులాల పేదలకు భరోసా

- వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం నిధుల విడుదల
- జిల్లాలో 17,953 మందికి రూ.26.93 కోట్ల లబ్ధి
- మెగా చెక్కును అందజేసిన కలెక్టర్ పి.అరుణ్‌బాబు



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: అగ్రవర్ణ కులాల్లోని పేదలకు భరోసా ఇచ్చేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని పక్కాగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే మూడో విడతకు సంబంధించిన ఈబీసీ నేస్తం నిధులను గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలో నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలాజ్యోతి, గ్రామ/వార్డు సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ అగ్రవర్ణ పేదలను సైతం పేదలను గుర్తించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే చెందుతుందన్నారు. వారికి ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచి వారి కుటుంబాల్లో సంతోషాలను నింపారన్నారు. మూడు విడతల్లో ఒక్కో కుటుంబానికి రూ. 45 వేలు అందించినట్లు వివరించారు. ఇందులో రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ తదితర అగ్రవర్ణ పేదలు ఉన్నారన్నారు.

17,953 మందికి లబ్ధి..

జిల్లాలో ఈబీసీ నేస్తం కింద మూడో విడతలో 17,953 మంది లబ్ధిదారులకు రూ.26.93 కోట్ల లబ్ధికి సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి అందజేశారు. అర్హులైన ఒక్కో మహిళ ఖాతాకు రూ.15 వేలు చొప్పున మూడేళ్ల పాటు రూ.45 వేలు అందజేశారు. 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈబీసీ నేస్తంలో కమ్మ వర్గానికి చెందిన వారు 2,241 మంది, రెడ్లు 12,115 మంది, ఆర్యవైశ్యులు 1,240 మంది, బ్రాహ్మణులు 508 మంది, క్షత్రియులు ఆరుగురు, ఈబీసీ 125 మంది, కాపు 1,718 మంది కలిపి 17,953 మంది ఉన్నారు.

అగ్రవర్ణ పేదలకు అండ



అగ్ర వర్ణ నిరుపేదలను గుర్తించి సహాయం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పని చేసినా ఇలాంటి పథకాలను ఎప్పుడూ అమలు చేయలేదు. మహిళల కోసం పారదర్శకంగా పథకాలు అమలు చేయడం వైఎస్ జగన్‌కే చెల్లింది. చాలా సంతోషంగా ఉంది. నా ఛాట్ బండార్ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటా.

– అనిత, పుట్టపర్తి

అక్క చెల్లెమ్మల ఆశీర్వాదం జగనన్నకే..



వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా మొదటిసారి రూ.15 వేలు మంజూరైంది. దీన్ని ఉపయోగించుకొని మందిరంలో టైలరింగ్‌ను అభివృద్ధి చేసుకుంటాను. మహిళల అభ్యున్నతికి ఇంత కృషి చేసిన వాళ్లు లేరు. సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిది. వైఎస్ జగన్ చల్లగా ఉండాలి. అక్క చెల్లెమ్మల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఆయనకే ఉంటుంది.

– శ్రీవిద్య, ప్రశాంతి నిలయం

సీఎంగా జగనన్నే ఉండాలి



గతంలో ఏ ప్రభుత్వం ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందించలేదు. జగనన్నకే అది సాధ్యమైంది. అందుకే పేదల గుండెల్లో జగనన్న చిరస్థాయిగా నిలిచిపోతారు. జీవితాంతం ఆయన ముఖ్యమంత్రిగా ఉంటే మహిళలు మహారాణులవుతారు. ప్రతి మహిళా లక్షాధికారి అవుతారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మహిళలందరూ జగనన్నకే మద్దతు పలుకుతున్నారు. – పూర్ణిమ, విభూది సెంటర్, గోకులం



అలంకరణలో పోతలయ్యస్వామి



విద్యుత్‌దీపాల అలంకరణలో పోతలయ్యస్వామి ఆలయం

వైభవంగా గావుల మహోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన దాదులూరు

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామి గావుల మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకుజామునే స్వామి వారికి భక్తులు బోనాలు సమర్పించారు. అనంతరం ఉరుముల శబ్దాలతో ఎనిమిది మంది పోతురాజుల విన్యాసాలు చేసుకుంటూ ఆలయంలోకి వచ్చి 12 మేకపోతు పిల్లలకు స్వామికి బలి ఇచ్చి రక్తతర్పనం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావటంతో ఆలయ ఆవరణమంతా కిక్కిరిసిపోయింది.



ఉరుములు వాయిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి నుంచి కోన కణ్వాశ్రమానికి వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఓ యువకుడు ఉరి వేసుకుని విగత జీవిగా వేలాడుతున్న విషయాన్ని పశువుల కాపరులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టని స్థితిలో ఉంది. కొన్ని రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల్లో వయస్సు ఉంటుందని అంచనా వేశారు. గళ్ల చొక్కా, ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అమడగూరు: మండలంలోని సంగీతంపల్లి శివారులో 864 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మగ్బూల్ బాషా తెలిపారు. అందిన ముందస్తు సమాచారంతో గ్రామ శివారులో తనిఖీలు చేపట్టగా, మహమ్మదాబాద్‌కు చెందిన రాజా అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కంటి చూపుపై శ్రద్ధ వహించండి


మాట్లాడుతున్న డాక్టర్ అనూరాధ

ప్రశాంతి నిలయం: కంటి చూపు సంరక్షణపై శ్రద్ధ వహించాలని జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అనురాధ అన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గురువారం పుట్టపర్తిలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కంటి చూపు సరిగా కనబడకపోయినా, కంటిలో శుక్లాలు ఉన్నా, గ్లకోమా (నీటి కాసులు) ఉన్న వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. 35 నుంచి 40 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలితాకుమారి, అబిద్, రాజేశ్వరి, పలువురు రోగులు పాల్గొన్నారు.

దిగుబడులపై ఆందోళన వద్దు

- చీనీ రైతులకు ఉద్యానశాఖ రాష్ట్రస్థాయి బృందం సూచన
- రెండు జిల్లాల్లో అక్కడక్కడా వేరుకుళ్లు తెగుళ్లు, పొలుసు పురుగు
- ఆర్గానిక్ మల్చింగ్, కత్తిరింపులు, నీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాలి
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా రైతులకు లబ్ధి


తాడిమర్రి మండలంలో చీనీ రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖ బృందం అధికారులు

అనంతపురం అగ్రికల్చర్/తాడిమర్రి/ కనగానపల్లి: తెగుళ్లపై చీనీ, ఇతర ఉద్యాన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చీడపీడల నివారణ, నీటి యాజమాన్యంపై దృష్టి సారిస్తే చాలని ఉద్యాన శాఖకు చెందిన రాష్ట్ర స్థాయి బృందం స్పష్టం చేసింది. చీనీ తోటలు, ఇతర పండ్లతోటల పరిశీలన నిమిత్తం ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, భూగర్భజలవనరుల శాఖలకు చెందిన రాష్ట్ర స్థాయి బృందం ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం పర్యటించింది. ఏపీఎంఐపీ ఓఎస్‌డీలు వై.వెంకటేశ్వర్లు, డి.రమేష్, ఉద్యానశాఖ ఏడీ ఎస్‌వీ రత్నాచార్యులతో పాటు రెండు జిల్లాల ఏపీఎంఐపీ పీడీలు రఘునాథరెడ్డి, సుదర్శన్, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు చంద్రశేఖర్, బీఎంవీ నరసింహారావు, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ దత్తారెడ్డి, భూగర్భజలశాఖ ఏడీ జయరామిరెడ్డి, హైడ్రాలిస్టులు, హెచ్‌ఓలు రత్నకుమార్, నెట్టికంటయ్య, శైలజ, అమరేశ్వరి, ఉమాదేవి, రామ్ ప్రసాద్... తదితరులు దాదాపు 20 మందితో కూడిన అధికారులు నాలుగు బృందాలుగా గార్లదిన్నె, కూడేరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, శింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల్లో ప్రధానంగా చీనీతోటలతో పాటు అరటి, మామిడి, బొప్పాయి, జామ తదితర పంటలు పరిశీలించారు. రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

ఆందోళన వీడండి..

వివిధ గ్రామాల్లో చీనీ తోటలను పరిశీలించిన అధికారులు అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. చీనీ దిగుబడులపై ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వేసవిలో సాధారణంగా వచ్చే వేరుకుళ్లు, ఎండుకుళ్లు తెగులు అక్కడక్కడ కనిపిస్తోందన్నారు. అలాగే పొలుసుపురుగు, మంగునల్లి ఉన్నట్లు తెలిపారు. నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా ఆర్గానిక్ మల్చింగ్ విధానం పాటించాలన్నారు. పంట పొలాల వ్యర్థాలు, గడ్డి, వివిధ రకాల పొట్టు, కందికట్టె, ఆకులు లాంటి వాటిని చెట్టు మొదలు చుట్టూ పరిస్తే త్వరగా నీరు ఆవిరి కాకుండా ఉంటుందన్నారు. కొంత మంది రైతులు మోతాదుకు మించి నీటి తడులు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. ఒక్కో చెట్టుకు రోజుకు 100 నుంచి 110 లీటర్ల నీరు అవసరమన్నారు. అంటే మూడు గంటల పాటు డ్రిప్ ద్వారా నీటిని అందిస్తే సరిపోతుందన్నారు. కొందరు రైతులు ఆరు నుంచి ఏడు గంటలు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. చెట్టుకు గాలి, వెలుతురు బాగా ప్రసరించేలా కత్తిరింపుల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. కొత్తగా బోర్లు వేయడం మంచిది కాదన్నారు. ఉన్న నీటి వనరులకు డ్రిప్ ద్వారా క్రమ పద్ధతిలో వాడుకుంటే సరిపోతుందని సూచించారు. ట్రికోడెర్మావిరిడీ, సూడోమోనాస్ ప్లోరోసిస్ లాంటి తక్కువకే లభించే జీవనియంత్రణ ఎరువులు, మందులు, అలాగే చెట్టు మొదలుకు బోర్డో పేస్టు పట్టించడం, జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి వాటితో పచ్చిరొట్ట పైర్ల ద్వారా భూసారం పెంచుకుంటే చాలా వరకూ చీడపీడలు సమర్థవంతంగా నివారించుకోవచ్చని అవగాహన కల్పించారు.

ఉచిత పంటల బీమా వర్తింపు..

రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చీనీ, దానిమ్మ, అరటి, టమాట లాంటి పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేస్తోందని తెలిపారు. ఈ–క్రాప్ ఆధారంగా గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున పరిహారం చెల్లిస్తోందన్నారు. అలాగే చిన్నపాటి ఫారంపాండ్ల నిర్మాణానికి రూ.75 వేలు, కమ్యూనిటీ ఫారంపాండ్లకు రూ.2 లక్షల వరకు రాయితీని కూడా అందజేస్తోందన్నారు. ప్లాస్టిక్ మల్చింగ్‌కు హెక్టారుకు రూ.16 వేలు, చీనీ తోటలకు డబుల్ ల్యాటరల్ డ్రిప్ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. ఆర్‌బీకేల్లో సంప్రదించి ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, భూగర్భ జలశాఖ ఉప సంచాలకులు వినోద్, ఉద్యాన అధికారిణి అమరేశ్వరి, రేకులకుంట వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ దత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

- ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి

ముదిగుబ్బ: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యంగా జగన్ సర్కార్ పనిచేస్తోందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ముదిగుబ్బ మండలం దొరిగిల్లు వద్ద రూ.2.82 కోట్ల వ్యయంతో నిర్మించిన 33, 11 కేవీ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. దొరిగిల్లు, టీఎన్‌పాళ్యం, సంకేపల్లి గ్రామాల పరిధిలో లో ఓల్టేజీ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించి నూతన సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని దొరిగిల్లు, బీసీ కాలనీ, దొరిగిల్లు తండా, నక్కలపల్లి, నాగలగుబ్బల, టీఎన్ పాళ్యం, ఎస్ బ్రాహ్మణపల్లి, ఇందుకూరు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కిందన్నారు. మొత్తం నాలుగు ఫీడర్లలో మూడింటిని వ్యవసాయానికే కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే రాళ్లఅనంతపురం, మలకవేమల క్రాస్, దొరిగిల్లు సబ్ స్టేషన్లను నిర్మించగా, మరికొన్ని సబ్ స్టేషన్ల నిర్మాణాలకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో లో ఓల్టేజీ సమస్య ఉత్పన్నం కాకుండా అవసరమైన ప్రతి చోట విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డీఈ మోసస్, ఏడీలు సుబ్రహ్మణ్యం, మక్బుల్‌బాషా, ఇన్‌చార్జ్ ఏఈ శివతేజ, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరు నారాయణరెడ్డి, కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మునిచంద్ర, వెంగళరెడ్డి, అంజి, మహేష్, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతలో మైసూర్‌-హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

అనంతపురం సిటీ: ప్రయాణికుల సౌకర్యార్థం అనంతపురం రైల్వే స్టేషన్‌లో గురువారం నుంచి మైసూర్‌–హుబ్లీ–మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ తెలిపారు. హుబ్లీ నుంచి మైసూర్‌కు బయలుదేరే రైలు (16591) అనంతపురానికి అర్ధరాత్రి 1.03 గంటలకు వచ్చి 1.05కు బయలుదేరుతుందన్నారు. అలాగే మైసూర్ నుంచి హుబ్లీ వెళ్లే రైలు అనంతపురం స్టేషన్‌కు అర్ధరాత్రి 2.32కు వచ్చి 2.34 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఈ రైళ్లు హోస్పేట, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం, హిందూపురం, బెంగళూరు మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

పచ్చమీడియా రోత రాతలపై ఫిర్యాదు

- పట్టాల పంపిణీలో అక్రమాలంటూ కథనం
- విలేకరిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి బయటకు వస్తున్న లబ్ధిదారులు

కొత్తచెరువు: ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ పచ్చమీడియాలో వెలువడిన కథనంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్య కథనాలు ప్రచురించిన ఆంధ్రజ్యోతి విలేకరిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో పలువురు లబ్ధిదారులు మాట్లాడారు. ఇటీవల కొత్తచెరువు – ధర్మవరం రోడ్డులోని జగనన్న లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న 22 ప్లాట్లను అర్హులైన పేదలకు వారి పేరు మీద ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిచ్చిందన్నారు. దీంతో లబ్ధిదారులు మంగళవారం గృహ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. అయితే ఈ అంశాన్ని వక్రీకరిస్తూ ఆంధ్రజ్యోతి పత్రికలో రోత రాతలు రాశారని మండిపడ్డారు. జగనన్న స్థలం రూ.50 వేలు అంటు 22 ప్లాట్లకు రూ.11 లక్షలను కొత్తచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వసూలు చేసినట్లుగా అవాస్తవాలను ప్రచురించి, లబ్ధిదారుల మనోభావాలు దెబ్బతీసిన సదరు విలేకరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ సీఐ రాజారమేష్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

జూన్ ఆఖరుకల్లా 4జీ సేవలు

- బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్‌పాషా
- 3జీ నుంచి 4జీ సిమ్ అప్‌డేట్ ఉచితం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో జూన్ 31 నాటికి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. డిసెంబర్ నెలాఖరు కల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకూ 4జీ సేవలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాక 5జీ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.40 లక్షల మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు ఉండగా, 2,500 మంది పోస్ట్‌పెయిడ్ వినియోగించే వారు ఉన్నారన్నారు. ల్యాండ్‌ఫోన్ కనెక్షన్లు కలిగిన 4,750 మంది వినియోగదారులు కాపర్ కేబుల్ నుంచి ఫైబర్ కేబుల్‌కు మారాలని సూచించారు. ఈ ప్రక్రియ ఆరు నెలల్లోపు పూర్తవుతుందన్నారు. ఫైబర్ కేబుల్‌కు మారడం వల్ల మెరుగైన, నాణ్యమైన సేవలు పొందవచ్చునన్నారు. ఇంటర్నెట్ స్పీడ్ పెరుగుతుందన్నారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నెట్‌వర్క్ టవర్ సేవలు అందని గ్రామాలు 21 ఉన్నాయని, ఆయా గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయడంతో పాటు 4జీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- దేశ పురోగతికి ఏకైక మార్గం చదువే


ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ హుస్సేన్‌రెడ్డి (చిత్రంలో) వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం: అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని విద్యార్థులకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'విద్యార్థి దశలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు' అంశంపై ఎస్కేయూలోని భువన విజయం ఆడిటోరియంలో గురువారం మోటివేషనల్ స్పీకర్ వేణుకళ్యాణ్ ఆధ్వర్యంలో యూత్ లీడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యేతో పాటు ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఏకైక మార్గం చదువేనన్నారు. ప్రపంచంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అత్యున్నత స్థాయిలో మన విద్యార్థులు ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. సంకల్ప సాధనలో భాగంగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి ఉన్నత విద్యను పేదలందరికీ చేరువ చేశారని కొనియాడారు. కష్టాన్ని ఓర్చుకుని, ఇబ్బందులను తట్టుకునే వారే కచ్చితంగా భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. అక్షర క్రమంలో ముందున్న అనంతపురం జిల్లాను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టే స్థాయికి అందరూ ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పుట్టపర్తి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 31వ తేదీ వరకూ జరగనున్నాయి. ఇందులో భాగంగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో పది పరీక్షలపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 115 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

తల్లి లేని బాలిక... జాలి లేని పెద్దమ్మ

- చెల్లెలు కుమార్తెను ఇస్త్రీ పెట్టెతో కాల్చిన వైనం
- బ్యాంకులోని డబ్బు కోసం అకృత్యం


బాలికను ఆరా తీస్తున్న శిశు సంక్షేమ సంఘం సభ్యులు

తుమకూరు (కర్ణాటక): తల్లి లేని బాలికను ఆదరించాల్సింది పోయి ఆస్తిపై మోజుతో ఇస్త్రీ పెట్టెతో వాతలు పెట్టిందో కిరాతకురాలు. ఆమె సొంత పెద్దమ్మ కావడం గమనార్హం. బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలు.. తుమకూరు తాలూకా దొడ్డేరి దగ్గర పూజారహళ్లి గ్రామానికి చెందిన రంగనాథ్‌కు పదేళ్ల వయసున్న కుమార్తె సరస్వతి ఉంది. బాలిక తల్లి చనిపోవడంతో పొరుగునే ఏపీలోని అమరాపురం మండలం నిద్రఘట్ట గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ నంజమ్మ సంరక్షణలో వదిలారు. గతంలో పొలం విక్రయించగా వచ్చిన డబ్బును తన భార్య, కుమార్తె పేరున జాయింట్ ఖాతా కింద బ్యాంక్‌లో రంగనాథ్ జమ చేసి ఉంచాడు. ఈ విషయం తెలుసుకున్న నంజమ్మ, ఆమె కొడుకు బసవరాజు ఎలాగైన ఆ డబ్బు కాజేయాలని కుట్ర పన్ని బాలికను వేధించడం మొదలు పెట్టారు. పేపర్లపై సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేయగా బాలిక ఒప్పుకోలేదు. మా నాన్న, అమ్మమ్మ చెబితేనే సంతకం చేస్తాననడంతో నంజమ్మ, బసవరాజు రగిలిపోయి ఇస్త్రీ పెట్టెను వేడి చేసి బాలిక కాలు, తొడపై వాతలు పెట్టారు. అనంతరం బాలికను ఇంట్లోని గదిలో బంధించి బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. పాఠశాలకు బాలిక గైర్హాజరు కావడంతో ఉపాధ్యాయుడు బాలిక తండ్రి రంగనాథ్‌కు ఫోన్ చేసి పరీక్షలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో బాలికను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని సూచించారు. దీంతో ఆయన నంజమ్మకు ఫోన్ చేసి కుమార్తెను ఇంటికి పంపాలని కోరాడు. దీంతో అప్రమత్తమైన నంజమ్మ వెంటనే ఇంటికి చేరుకుని జరిగిన దురాగతాన్ని ఎవరితోనూ చెప్పరాదని బాలికను బెదిరించి తండ్రి వద్దకు పంపేందుకు సిద్ధమైంది. అయితే బాలిక నడవలేని స్థితిలో ఉండడంతో వెంటనే మధుగిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంటనే చికిత్స మొదలు పెట్టి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, నంజమ్మతో పాటు ఆమె కొడుకుపై కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా శిశుసంక్షేమ సంఘం సభ్యులు బాలికను పరామర్శించారు.

ఎన్నికల సామగ్రి తరలింపు


సామగ్రిని అందజేస్తున్న ఎన్నికల అధికారి మైనుద్దీన్

పుట్టపర్తి అర్బన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఎన్నికల సామగ్రిని కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని నియోజక వర్గాల కేంద్రాలకు తరలించారు. ఇటీవల కలెక్టరేట్‌కు వచ్చిన సామగ్రిని ఒక గదిలో భద్రపరిచారు. ఎన్నికల కోడ్ వెలువడనున్న నేపథ్యంలో అన్ని నియోజక వర్గాలకు ప్రత్యేక వాహనాల్లో సామగ్రిని తరలించారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రితో పాటు ఓటర్లకు అందజేసే స్లిప్పులు, తెలుపు, పింక్ కలర్ స్లిప్పులు తరలించారు. ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు సంబంధించిన హ్యాండ్ బుక్‌లు, సీక్రెట్ ఓటింగ్ బాక్సులు, ఈవీఎంలకు అవసరమైన బ్యాటరీలను జిల్లా ఎన్నికల అధికారి మైనుద్దీన్, డీటీ నరసింహులు ఆధ్వర్యంలో పంపించారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగంలో పలువురికి చోటు

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగ కమిటీలో కదిరి నియోజకవర్గానికి చెందిన పలువురికి చోటు లభించింది. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సి.చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీగా గోవిందు శివశంకర్‌రెడ్డి, సెక్రటరీలుగా బి.గురుబాషా, ఎస్.విష్ణువర్ధన్, జాయింట్ సెక్రటరీగా ఎస్.షాకీబ్‌లకు అవకాశం లభించింది. ఈమేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా తిరుపాల్‌నాయక్..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన ఇస్లావత్ తిరుపాల్ నాయక్ నియమితులయ్యారు.

ప్రభుత్వ గుర్తింపుపై హర్షం

పెనుకొండ: వైఎస్సార్‌టీఏకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు దక్కడంపై ఆ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు రమణారెడ్డి, పుల్లారెడ్డి, జంషీర్, నాగరాజు, శివయ్య తదితరులు గురువారం హర్షం వ్యక్తం చేసారు. ఈ నెల 14న గుర్తింపునిస్తూ జీఓ 32ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సంఘం గుర్తింపునకు ఆమోదం తెలిపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సంఘం అభివృద్ధికి సహకరించిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, సంఘం గుర్తింపునకు కృషి చేసిన శాసనమండలి సభ్యురాలు టి.కల్పలత, పి.చంద్రశేఖరరెడ్డి, రామచంద్రారెడ్డి, విద్యాశాఖామాత్యులు బొత్స సత్యనారాయణ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జాలిరెడ్డి, అశోక్‌రెడ్డి, గెడ్డం సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన సంగీత కచేరీ


కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు గురువారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. సత్యసాయి ప్రేమతత్వాన్ని, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతూ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ విద్యార్థులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను మైమరపించింది.

రూ.10.70 లక్షల నగదు సీజ్

రాయదుర్గం రూరల్: స్థానిక పైతోట మారెమ్మ గుడి వద్ద గురువారం రూ.10.70 లక్షల నగదును చెక్‌పోస్టు అధికారులు సీజ్ చేశారు. విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన వ్యాపారి కుమ్మరి రామాంజినేయులు నగదు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ ప్రసాద్ బాబు తెలిపారు. కర్ణాటకలోని చిత్రదుర్గలో వేరుశనగ విక్రయించి సొమ్ము తీసుకువస్తున్నట్లుగా వ్యాపారి తెలిపినప్పటికి, ఇందుకు సంబంధించి సరైన ఆధారాలు చూపలేదన్నారు. దీంతో సరైన ఆధారాలు తహసీల్దార్‌కు చూపి నగదు తీసుకెళ్లాలని వ్యాపారికి సూచించినట్లు తెలిపారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న నాలుగు ఆటోలను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.